# దివ్యత్వమనే చైతన్యము సర్వత్ర నిండి ఉంటున్నది

ప్రేమస్వరూపులారా!

దేశకాలపరిస్థితులకు నేను అతీతుడను. దేశకాల పరిస్థితుల ప్రభావమునకు కట్టుబడి యుండినటువంటివారు మీరు. మీకు దీనియొక్క నిజమైన అర్థమును బోధించే నిమిత్తమై మిమ్మల్ని ఇక్కడికి తీసుకువచ్చాను. ఒక్కొక్కరు ఒక్కొక్క విషయమును చెప్పినదానినిబట్టి మనకు జ్ఞానోదయము అవుతుంది. సకాలములో మనము వాటిని ఉపయోగపెట్టినప్పుడే మనకు సరియైన ఫలితము వస్తుంది. 'నేను ఏమి చెప్పినా కృష్ణుడు దయతో, ప్రేమతో చెప్పినాడని నీవు భావిస్తావు' అని చెప్పాడు కృష్ణుడు, ధర్మజునికి. నీ శరీర తత్త్వమువలన నాయొక్క మాటలు విసర్జించవచ్చును.

**కర్మఫలములన్నీ దైవాజ్ఞవలన సంభవించినవే**

కర్మఫలములన్నియుకూడను దైవాజ్ఞవలన సంభవించేవే కాని, అన్యులవలన కాదు. ఈ విశ్వాసాన్ని దృఢము చేసుకోవాలి. 'కదలదు నీదు సంకల్పము లేనిది, గడ్డిపోచయు......' ఒక గృహిణియొక్క అనుభవాన్ని ధర్మజునకు బోధించాడు, భీష్ముడు. ఆ విధముగా ఇతరులచేత ధర్మజునకు బోధలు చేయిస్తూ వచ్చాడు, కృష్ణుడు. ఒక ఇనుము వుంటున్నది. దానిని మనము కత్తులుగానో, విల్లులుగానో చేయాలని అనుకుంటాము. అది నల్లగా గట్టిగా వున్నంతవరకు ఎంతటి బలవంతుడు వచ్చి సుత్తితో కొట్టినా సాగదు. కాని, దానిని అగ్గిలో కాల్చి ఎఱ్ఱగా చేసినప్పుడు, బలహీనుడు వచ్చి కొట్టినా అది సాగుతుంది. కనుక, ఆయా సమయమును బట్టి దానిని కొట్టాలి. హృదయమనేటువంటిది కఠినముగా వుంటున్నప్పుడు దైవము వచ్చి చెప్పినా అది సాగదు. కాని అది పరిపక్వస్థితికి వచ్చినప్పుడు, ఎవరు కొట్టినా అది సాగుతుంది. పిచ్చివాళ్లు తిరుగుతూ తత్త్వాలు పాడుతుంటే ఆ పాటలను విని మార్పువచ్చినటువంటివారు చాలామంది వున్నారు.

**కర్మఫలము ఎల్లప్పుడు మనవెంటనే ఉంటుంది**

sri satyasai vachanamrutam

కర్మానుబంధమును గెలవ సాధ్యమౌనా! అలనాటి పాండవులు ఆకులు, అలములు తిని అడవులపాలైరి. పంచభక్ష్యపరమాన్నములు తిన్న పాండవులు ఆకులు అలములు తినడము ఏమిటి? కర్మ అనేటువంటిది ఏ విధముగా వుంటుండాది అనే దానికి ఒక చక్కని ఉదాహరణము. ఒకరిని శని గ్రహము పీడించటమువలన ఏడున్నర సం॥లనుండి దారిద్ర్యము పట్టుకుందని బాధ పడుతున్నాడు. తాను ఈశ్వరుని ప్రార్థిస్తూ కూర్చున్నాడు. ఒకనాడు ఈశ్వరుడు ప్రత్యక్షమయ్యాడు. నీ సమస్య ఏమిటి అని అడిగాడు, ఈశ్వరుడు. శని ఏడున్నర సం॥లు నుండి పట్టి పీడిస్తూన్నాడన్నాడు. ఆ శని గ్రహమును దూరము చెయ్యమన్నాడు. సరే నేను శనికి చెబుతాను అని అదృశ్యమయ్యాడు. కైలాసము వెళ్లి శనిని పిలిపించి 'నీవు నా భక్తుని చాలా హింసిస్తున్నావట, నీకు అంత బలమున్నదా, నీ బలము నా మీద చూపించు' అని అడిగాడు. అందుకు శని 'సరే మీ మీద చూపిస్తాను' అని అక్కడనుండి వెళ్లిపోయాడు. అనాటినుండి శని ఎప్పుడు వస్తాడో అని ఈశ్వరుడు ఎదురుచూస్తున్నాడు. నేను ఒకవేళ స్వర్గములో, వైకుంఠములో, కైలాసంలో యుంటే నన్ను కనిపెడతాడు. కాబట్టి శని చేరలేనట్టి వేరే ఏదైనా ప్రదేశములో దాగి యుండాలి అని యోచించాడు, ఈశ్వరుడు. అప్పుడు తన సంకల్పముచేత చీమ అంతటి పరిమాణములో తన శరీరాన్ని మార్చుకొని ఒక చెట్టు తొఱ్ఱలో చేరియుండినాడు. ఈ చెట్టు తొఱ్ఱలో మూడు నెలలు వేచియున్నాడు. శని రాలేదు. అతనికి ధైర్యము లేదు అని యోచించి తిరిగి కైలాసమునకు చేరుకొని శనిని పిలిపించాడు. 'నీవు మూడు నెలలనుండి నా దగ్గరకు చేరలేదు నన్ను పట్టుకొనలేద'న్నాడు. అప్పుడు శని చెప్పాడు, 'స్వామీ! నేను పట్టుకొనటంచేతనే కైలాసములో వుండవలసిన మీరు చెట్టు తొఱ్ఱలో యుండవలసి వచ్చింది. అదియే నా శక్తి' అన్నాడు. అప్పుడు శని పట్టుకోటమంటే ప్రత్యక్షముగా కాదు, పరోక్షముగా అని తెలుసుకున్నాడు. కాబట్టి, కర్మఫలమంటే ఈ విధముగానే వుంటుండాది. కర్మకు రూపములేదు. అది ఒక స్థాయిలో వుండదు. అది ఎప్పుడూ నీతోనే వుంటుండాది. 'పాపమనగ వేరు పరదేశమునలేదు, తాను చేయు పనుల దవిలియుండు. దేవుడనగా వేరు దేశమునందులేదు, తాను చేయు పనులయందు తగిలియుండు'. తన నీడ ఏ విధముగా తన వెంటయుండునో అట్లే కర్మకూడను మనవెంటనే యుండును.

sri sathyasai vachanamrutam

## లోకముయొక్క పోకడను అర్థము చేసుకోటానికి ప్రయత్నించాలి

లోకముయొక్క పోకడను మనము అర్థము చేసుకోటానికి ప్రయత్నించాలి. ఒక రైతునకు ఇద్దరు కొడుకులు వుంటున్నారు. తండ్రి తన పెద్దకుమారునకు తనయొక్క బాధ్యతలు, పనులను చక్కగా వివరముగా బోధపరుస్తూవచ్చాడు. గ్రామములో ప్రజలను చక్కగా గౌరవిస్తూ వారియొక్క సమస్యలను సరిగా పరిష్కరించటమువంటి పనులలో తండ్రితో బాటు కుమారుడుకూడా సహకరిస్తూ వచ్చాడు. కాలమునకు అనుగుణముగా తండ్రి కాయమును వదలినాడు. తండ్రి బాధ్యత పెద్దకుమారుడిపైన పడినది. కాలము గడుస్తూవచ్చింది. కాని, చిన్న కుమారుడు చెడు సహవాసమువలన కాలమును వ్యర్థము చేస్తూ దుబారాగా తిరుగుతూ వచ్చాడు. అతనియొక్క పరిస్థితి గ్రామస్థులద్వారా అన్న చెవిలో పడింది. తండ్రిలేని తమ్ముని బాధ్యతగా చూడటంలేదని అపకీర్తి వస్తుందని భావించాడు. 'గ్రామస్థుల బాధ్యత నేను చూసుకుంటాను, నీవు పొలముల బాధ్యత తీసుకో'మని చెప్పి అతనిపైన కొంత భారము వేశాడు. కాని, అతను పొలము పనులకు వెళ్లకుండా, స్నేహితులతో జులాయిగా తిరుగుతూ వచ్చాడు. ఆ సమయములో అతని స్నేహితులు వాడికి దుర్బోధ చేస్తూ వచ్చారు: 'పొలము పనులు నీవు చేస్తున్నావు. మీ అన్నయ్య మాత్రము జమీందారులాగా న్యాయములు, ధర్మములు చెబుతూ హాయిగా జీవితము గడుపుతూ వస్తున్నాడు. ఇది అన్యాయముకాదా, కాబట్టి నీవు మీ అన్నయ్యతో పోట్లాడి వేరుగా వుండ'మని చెప్పారు. ఈ చెప్పుడు మాటలవలన అతని హృదయములో మార్పు వచ్చినది. ధైర్యముచేసి అన్నయ్యతో 'నేను ఇంటిదగ్గర వుంటాను. నీవు పొలము పనులు చూసుకో' అన్నాడు. 'నాయనా! నీకు అనుభవము లేదు, గ్రామస్థుల వ్యవహారము. చాలా తెలివిగా నడచుకోవాలి. కాబట్టి నీవు నాతోయుండి కొన్ని దినములు అలవాటు చేసుకో, అనుభవము వచ్చిన తరువాత నీ యిష్టము', అని బదులిచ్చాడు. అందుకు తమ్ముడు 'లేదు, నేను నీతో యుంటాను. పొలము పనులకు వెళ్లను', అని జవాబు యిచ్చాడు. అప్పటినుండి అన్నగారితో ఉండి గ్రామస్థులతో ఏ విధముగా వ్యవహరిస్తున్నాడో అన్నీ గమనిస్తున్నాడు. ఆ గ్రామములో ఒక రైతుయొక్క తల్లి మరణించింది. అన్నగారు ఆ రైతును ఓదారుస్తూ వున్నాడు, 'నీ తల్లి మరణించిందని నాకు తెలిసింది, నీవు భయపడకు, గ్రామస్థులంతా నీకు

sri sathyasai vahini

అండగా వుంటారు. నీ తల్లి చాలా మంచిది. ఆమె నాకూ తల్లిలాంటిది, అందరికి తల్లివంటిదే, నీవు దుఃఖపడవద్దు' అని చెబుతూ వచ్చాడు. అది చూచిన తమ్ముడు 'ఇంతమాత్రము సమాధానము నేను చెప్పలేనా, ఇంతదానికే గొప్పతనమా' అని అనుకున్నాడు. రెండవరోజు ఆ గ్రామములో ఒకతనికి భార్య చనిపోయింది. ఈ తమ్ముడు అతనిని ఓదారుస్తూ, 'నీ భార్య పోయిందని నాకు తెలిసింది, నీవు ఏమీ చింతించకు, అమె చాలా మంచిది. ఆమె నీకే కాదు, నాకూ భార్యలాంటిదే! అందరికి భార్యవంటిదే!' అని సమాధానము చెప్పాడు. ఆ సమయములో అన్న, తమ్మునికి చీవాట్లు పెట్టి, దేహశుద్ధి చేశాడు. దేహశుద్ధి అయిన తరువాత అతనికి గుణపాఠము వచ్చింది. అప్పుడు అన్నయ్య తమ్ముని పిలచి 'ఇటువంటి విషయములలో లౌకికము చాలా అవసరము. ఈ లౌకిక వ్యవహారములందు, లౌకిక తెలివితేటలుకూడా అవసరము. ఆధ్యాత్మిక వ్యవహారమునందు, దానికి సంబంధించిన జ్ఞానము అవసరము. ప్రాపంచిక, నైతిక, భౌతిక, ధార్మిక, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక, లౌకికములు నేర్చుకోవాలి. దైవత్వమునందుయున్న రహస్యముకూడా గుర్తించుకోవాలి. ఏనాడు అవన్నియు మనము గుర్తించుకుంటామో అప్పుడే దైవత్వముపై సంపూర్ణ విశ్వాసము కలుగుతుంది', అని బోధపరచాడు.

**దైవముపైన ఆధారపడి కర్తవ్యమును నిర్వర్తించేవాడు జీవితమంతా సుఖ, శాంతులను అనుభవిస్తాడు**

ప్రతీది దైవముయొక్క సంకల్పమే! ప్రతిపని ఒకరి ద్వారానే జరుగుతున్నాది. నేను, నా కొరకు, నా గురించి అనుకోటము అహంకారము. ఒకరిద్వారా అనునది దైవికము. నీ దేహముద్వారా, నీ గుణముద్వారా, నీ ప్రవర్తనద్వారా తాను పని జరిపించుకుంటున్నాడు. ఎవరికి, ఎవరికి సంబంధములేదు. అయితే వున్నంతవరకు మన కర్తవ్యములను నిర్వహించాలి. ఆశ వుండవచ్చును, కాని అది అనుభవములోనికి వచ్చినప్పుడు చాలా ప్రమాదము వస్తున్నది. ఒక చిన్న ఉదాహరణము. అందరూ జమిందారులవలే వుంటున్నారు, తాను కూడా ఆ విధముగా వుండవలెనని ఒకడికి కోరిక పుట్టింది. అంత స్థలము కొనటానికి ఎంత డబ్బు కావాలి అని యోచించలేదు, కాని తాను జమిందారు

sri sathyasai vahini amrutam

కావాలి! అని ఒక జమిందారువద్దకు వెళ్లి అతనిని సలహా అడిగాడు. 'నా దగ్గర డబ్బులేదు; కాని నాకు 100 ఎకరములు స్థలము కావాలి', అన్నాడు. 'నాయనా! మన దేశములో నీకు కావలసిన స్థలము ఎక్కడ అగుపించదు. నీవు నేపాల్ వెళ్లి అక్కడ రాజుగారి దగ్గరకు వెళ్లి కోరినట్లయితే దొరకవచ్చును', అని జవాబిచ్చాడు అవతలి వ్యక్తి. అతను నేపాల్ వెళ్లి రాజు దగ్గరకు పోయి 'నాకు జమీన్ కావాలి' అన్నాడు. 'ఎంత కావాలి' అని రాజు అడిగాడు. 'కనీసము 100 ఎకరములు కావాలి' అన్నాడు. 'నాయనా! 100 ఎకరములు కాదు, నీవు రేపు ఉదయము 6 గం॥లునుండి సాయంత్రము 6 గం॥లు వరకు ఎంత స్థలము చుట్టి వస్తావో అంత స్థలము నీకు యిస్తాను' అన్నాడు, రాజు. ఆహా! ఎంత అదృష్టము అనుకున్నాడు, పాపం! నడచుకుంటూ పోతే తక్కువ వస్తుంది, పరుగెత్తి పోతే ఎక్కువ స్థలము వస్తుంది అని యోచించి ఉదయము 6 గం॥లకు పరుగెత్తటం ప్రారంభించాడు. సాయంత్రంవరకు పరుగెత్తి, పరుగెత్తి అలసటతో 15 ని॥లు వుందనగనే అతనికి గుండె నొప్పి వచ్చింది. రాజుగారు వచ్చారు. 'నాయనా! నీవు వందల ఎకరములు స్థలము కావాలని వచ్చినావు. కాని, ఇప్పుడు నీకు కావలిసినది 6 అడుగులు మాత్రమే' అన్నారు. ఈ 6 అడుగులు గురించి మనము తిరగనక్కరలేదు. అది మనకు ప్రాప్తిస్తుంది. కనుక మనకు ఎంత ప్రాప్తమో అంత! మన కర్తవ్యాన్ని మనము నిర్వర్తించాలి. దైవముపైన భారము వేసి, అంతా దైవ కార్యముగానే భావించు. అనుకోని ఆనందములు, అనుకోని సౌభాగ్యములు నీకు సమకూరుతాయి. దైవముపైన ఆధారపడిచేసేవాడు జీవితమంతా సుఃఖశాంతులను అనుభవిస్తాడు.

### నీకు నీవు ఎంత సమీపమో దైవము నీకు అంత సమీపము

కొన్ని పరిస్థితులయందు దైవాజ్ఞనుకూడా ఉల్లంఘిస్తారు కాని, లోకానికి మాత్రము భయపడుతారు. ఈ విధముగా ఇంద్రియములకు బానిసలు అవుతున్నారుగాని, ఇంద్రియాతీతమైనటువంటి దైవత్వానికి ఏ మాత్రము తలవంచరు. కారణమేమనగా, మానవుడు ఇంద్రియములే జీవనమునకు ప్రధానమని భావిస్తున్నాడు. ఈ విషయాన్ని తనద్వారా కాకుండా భీష్మునిద్వారా చెప్పించాలనే ఉద్దేశ్యముతో ధర్మజుని భీష్మునిదగ్గరకు

srisathyasaivahini.org

తీసుకువెళ్లాడు, కృష్ణుడు. భీష్ముడు అంపశయ్యమీద వున్నాడు. ధర్మజుని, భీష్ముడి దగ్గరకు తీసుకువెళ్లాడు, కృష్ణుడు. ధర్మజునియొక్క పరిస్థితిని భీష్మునికి చెప్పాడు, కృష్ణుడు. 'భీష్మా! ధర్మజుడు విజయాన్ని సాధించాడు. కాని, అతని మనసు రాజులేని రాజ్యముగా వుంటుండాది. జీవములేని దేహముగా వుంటుండాది. తాడులేని బొంగరముగా వుంటుండాది. తాడు తెగిన గాలిపటమువలే వుంటుండాది. కనుక ఈ పరిస్థితిలోపల ఈ రాజ్యము నాకు అవసరములేదు అని ధర్మజుడు అంటున్నాడు. యీ ఏడుపు పూర్వమే ఏడ్చియుంటుంటే, యీ యుద్ధము జరిగేదికాదు కదా! ఆనాడు రాజ్యము కావాలని యుద్ధము చేసి, గెలిచిన తరువాత నాకక్కరలేదు అనటం సరికాదు'. విన్నాడు, భీష్ముడు. ధర్మజుని దగ్గర కూర్చోపెట్టుకున్నాడు. అతని హృదయమునకు నాటుకొనే విధముగా బోధలు చేస్తూ వచ్చాడు. 'ధర్మజా! నీవు కృతజ్ఞుడివా లేక కృతఘ్నుడివా?' అని అడిగాడు. రాజ్యము కావాలని ఉద్దేశ్యముతో సాక్షాత్తు భగవంతుడైన కృష్ణుని సారథిగా నియమించుకున్నారు. 'ఆనాడు విజయము కావాలని కృష్ణుడు చెప్పినట్లుగా విన్నారు. అతని ఆజ్ఞను తు.చా తప్పకుండా నడచుకున్నారు. యుద్ధములో విజయము సాధించిన పిదప అతని మాటలను ఉల్లంఘిస్తున్నారు. ఆనాడు కృష్ణుడు అవసరము, యీనాడు కృష్ణుడు నీకు అవసరములేదా? బ్రహ్మహత్యాపాతకమునకు ఒక పరిహారముంటున్నది. గోహత్యాపాతకమునకు ఒక పరిహారముంటున్నాది. ధన అపహరణమునకు ఒక పరిహారముంటున్నాది. చోరత్వమునకు ఒక పరిహారముంటున్నాది. యీనాడు ధర్మజుడుగా వుంటుండి ఇంతకాలము నీవు జీవించి నేడు భగవంతుని మాటలను విశ్వసించకుండా, అనుసరించకుండా పోతున్నావు. నీకిది చాలా చెడ్డది', అని బోధించాడు. ధర్మజుడు కంటిధారలు కార్చి, "తండ్రి లేనటువంటి పిల్లలం మేము, అలాంటి మమ్మల్ని దగ్గరకు చేర్చి, లాలించి, పాలించి, పోషించినటువంటి పితృతుల్యులైనటువంటివారిని నేను చేతులారా కూలగొట్టాను. పితామహులు, మీరు. అయినా యుద్ధములో కూలగొట్టాము. తన కుమారుడైనట్టి అశ్వత్థామనుకూడా దూరముగా పెట్టి అర్జునునకు అనేక విద్యలు నేర్పించాడు, ద్రోణాచార్యుడు. అశ్వత్థామ కామపుత్రుడైతే, అర్జునుని ప్రేమపుత్రునిగా భావించాడు, ద్రోణుడు. అలాంటి గురువునుకూడను నేల కూల్చాము. నేను చెయ్యని

srisathyasaivachanamrutam

పాపమే లేదు. గురువును, పితృ, దైవ సమానులైన మిమ్మల్ని అందరిని నిర్దాక్షిణ్యముగా చంపినాము. ఇప్పుడు నేను రాజు అని చెప్పుకోటానికి నాకు ఎక్కడ అధికారమున్నది? ఇలాంటి పాపపు పనులు చేసినవారికి ఏమాత్రము రాజ్యార్హత లేదు" అని విలపించాడు. అప్పుడు ప్రారంభించాడు, భీష్ముడు. "ధర్మజా! చంపటము నీవు కాదు. చచ్చినది నేను కాదు. జనన, మరణములు మానవునికడ లేవు. సర్వము విష్ణుమయము. అంతా భగవంతునియొక్క సంకల్పమే! పుట్టించినది, పోషించునది, కాపాడునది సర్వమూ భగవంతుడే! ఇవన్నియూ నిమిత్తమాత్రములైన దేహములు. దీనిని ఆధారము చేసుకుంటున్నావు. ఇవి జడమైనటువంటివి. వీటికి చైతన్యములేదు. జడమైనటువంటి ఇనుపముక్కను పెట్టితే అది కదలలేదు. కాని చైతన్యమనేటువంటి మేగ్నెటు పెట్టితే, అది ఎటు జరిపితే అటు కదులుతుంది. ఇనుపముక్క కదులుతే నీవు లైఫ్ అనుకుంటున్నావు. కాదు, కాదు. సమీపములో వున్న దైవత్వమనే చైతన్యమున్నది కనుక ఆ మేగ్నెట్ వలన అది కదులుతున్నది. అది సర్వత్రా నిండి వుంటున్నాది. అందువలననే 'సర్వతః పాణిపాదం తత్ సర్వతోక్షి శిరో ముఖమ్' అన్నారు. ఎక్కడ చూచినా వుండినటువంటి దైవత్వాన్ని విశ్వసించకుండా కేవలము నేను, నేను అని దేహముయొక్క ఆకారాన్ని నేనుగా భావిస్తున్నావు. దేవుడు ఎంత దూరముగా వుంటున్నాడని నీవు భావిస్తున్నావో, అంత దూరముగానే దేవుడుంటున్నాడు. ఎంత సమీపముగా వుంటున్నాడని నీవు భావిస్తున్నావో, అంత సమీపముగా వుంటున్నాడు. ఒక్కటి సూక్ష్మముగా చెప్పాడు. నీకు నీవు ఎంత సమీపమో, దైవము నీకు అంత సమీపము. కనుక, దైవత్వమనేటువంటిది ప్రత్యేకముగా లేదు".

### సర్వజీవులు భగవంతుని స్వరూపాలే!

సర్వముకూడను దైవముయొక్క సంకల్పముచేతనే జరుగుతున్నది. ఇది కర్మయొక్క ప్రధానమైన ఫలము. కర్మఫలమనేటువంటిదానిని అనుసరించుకొని నీవు ఇటువంటి అవస్థలకు గురి అవుతున్నావు. ప్రతీ వ్యక్తికూడను తాను చేసుకున్న కర్మలయొక్క ఫలితాన్ని అనుభవిస్తుంటాడు. ప్రతి వ్యక్తికి, ప్రతి విషయానికి, ప్రతి పదార్థమునకు రియాక్షన్,

sri sathyasai vahinamrutam

రిసౌండ్, రిఫ్లెక్షన్ వుంటుండాది. ధర్మజునకు, శాంతి పర్వము బోధిస్తూ భీష్ముడు దీనికి ఒక కథ చెబుతాను అని చెప్పాడు. "ఒక తల్లికి ఏకైక పుత్రుడు వున్నాడు. తనను తీసుకొని అరణ్యములో సంచారము చేస్తున్నది. ఆ పిల్లవాడిని తాను అలసిపోయినప్పటికి ఒక చెట్టుక్రింద తన తొడపైన పండుకొనబెట్టి తానుకూడా విశ్రాంతి తీర్చుకుంటున్నది. ఇంతలోపల 'బుష్, బుష్' అని శబ్దము వచ్చినది. ఏమిటని కళ్లు తెరచి చూచినప్పటికి పిల్లవాడు కెవ్వుమని ఏడ్చాడు. పుట్టనుండి పాము వచ్చి పిల్లవానిని కరచి పుట్టలోనికి వెళ్లిపోయింది. పిల్లవాని ఏడుపుచూచి తల్లి మూర్ఛపోయింది. ఆ విష ప్రభావమువలన పిల్లవాడు చనిపోయాడు. పిల్లవానిని దగ్గర పెట్టుకొని అరణ్యమంతా వినబడేటట్లు తల్లి రోదిస్తూ కూర్చొంది. ఇంతలో అక్కడికి విశ్రాంతి తీసుకోటానికి ఒక వేటగాడు వచ్చాడు. ఆ తల్లి పడుతున్న బాధను తాను సహించుకోలేకపోయాడు. దీనికి కారణము ఏమిటని ప్రశ్నించాడు. పుట్టలోని పామువచ్చి కాటు వేసి వెళ్లిపోయింది, అని బదులు చెప్పింది తల్లి. ఆ విషయము విన్నంతనే తన దగ్గరనున్న గడ్డపారను తీసుకొని పుట్టను పడగొట్టి పామును చంపటానికి ప్రయత్నించాడు. అయితే, కర్మఫలముపైన విశ్వాసము కల్గిన మాతృమూర్తి కనుక, ఆమె 'నాయనా! కేవలము పాము కరచటము కాదు, ఇది నా పిల్లవాడు చేసుకున్న కర్మ. ఆ పాముకు మాపైన ద్వేషములేదు, కోపములేదు. నిష్కారణముగా పాము వచ్చి కరచాలంటే అది నా కొడుకు చేసుకున్న కర్మ. నీవు పామును చంపినంత మాత్రమున నా కొడుకు తిరిగి బ్రతకడు. కాబట్టి నీవు ఆ పామును చంపనక్కరలేదు. ఎవరి కర్మను వారు అనుభవించాలి' అని చెప్పింది. అతను వేటగాడు. ఎందరినో చంపాడు. కర్మఫలముమీద నమ్మకము లేదు. కాబట్టి అతనికి కోపము వచ్చింది. కర్మమీద విశ్వాసము యుండినట్లయితే అతను ఎవరిని చంపడు. 'ఏమిటమ్మా నీవు? నీ కుమారుని చంపిన పాముపై దయతలచుతున్నావు. ఎంతమంది ఈ చెట్టుక్రింద విశ్రాంతి తీసుకుంటారో, వారందరిని పాము చంపవచ్చును కదా!' అన్నాడు. అప్పుడు ఆ తల్లి చెప్పింది, 'నాయనా! రాముని పాదము ఎన్ని రాళ్లకో తగిలింది, కాని అవన్నీ నాతిగా రూపొందినాయా? లేదే! అన్ని రాళ్లు అహల్యగా మారిపోయినాయా? అన్నీ పాదములు రాముని పాదములుగా మారిపోయినాయా? రాముని పాదమువంటి పాదము, అహల్యవంటి రాయి కలసినప్పుడే

శాపవిమోచనము కలుగుతుంది. కనుకనే అందరిని కరచటానికి అది ప్రయత్నించదు' అని చెప్పింది. కర్మానుబంధమును తప్పించుకొన ఎవరి వశము? నిత్యసత్యవంతుడగు సత్య హరిశ్చంద్రుడు మాటకొఱకు తాను కాటికాపరి కొలువు చేయలేదా? శ్రీమన్నారాయణుడు రామావతారమెత్తి రావణునిచే పలు బాధలు పడలేదా? ఇటువంటి బోధలు చేస్తూ వచ్చింది, ఆమె. ఎవరికి కర్మఫలము తప్పింది కాదు. కాబట్టి ఆ పామును హింసించవద్దు అన్నది. 'ఇది కేవలము దైవ సంకల్పముతప్ప, పాముతో జరిగేదికాదు. సర్వ జీవులు భగవంతునియొక్క స్వరూపాలే! ఆ కర్మఫలము పరిపక్వమైనప్పుడు, ఏదో ఒక విధముగా ప్రాణము తీసుకుపోతుంటాడు. తానే స్వయంగా రానక్కరలేదు. కాబట్టి చంపింది తాను కాదు. చచ్చింది నా కుమారుడు కాదు. దేహభ్రాంతివలన నేను బాధపడుతున్నాను. ఈ పిల్లవాడు నా కుమారుడు కాదు. ఆ పిల్లవాడు ఎన్ని కర్మలవల్ల పుడతాడో, ఎన్ని కర్మలవల్ల చనిపోతాడో?' ఇటువంటి వేదాంత విషయములు చెప్పేటప్పటికి ఆ వేటగాడి తల తిరిగింది. 'ఇవన్నియు నాకు అవసరములేదు, ముందు నేను ఆ పామును చంపి తరువాత నీయొక్క వేదాంతమును వింటాను' అన్నాడు. అప్పుడు ఆ తల్లి మళ్లీ 'ఒక చక్కని బోధ చేస్తాను' అని మొదలుపెట్టింది: 'నీవు ఒక వేటగాడివి, నీవు ఒక జంతువును విల్లుతో చంపావు. ఆ జంతువును నీవు చంపావా లేక నీ బాణము చంపిందా? బాణము ఒక పనిముట్టు. అది చంపలేదు. దానిని నీవు వదలిపెట్టితేనే అది జంతువును చంపింది. కాబట్టి పాము చంపలేదు. అది భగవంతుని సంకల్పమువలన జరిగినది. కాబట్టి పాముది ఏమాత్రము దోషములేదు'. స్వామి బయటవున్న నరసింహన్‌ను పిలవాలి. అందుకు పిలవటానికి ఎవరికైనా చెప్పవచ్చు. కేవలము ఒక్క వ్యక్తినే పంపాలని లేదు. కనుక, భగవంతుని సృష్టిలో సర్వులు జీవులే! భగవంతుడు ఎవరినైనా ఆజ్ఞాపించి అతనిని తీసుకు రమ్మని చెప్పవచ్చు. అదే విధముగా ఆ పిల్లవానిని చంపుమని పాముకు చెప్పాడు, పాము వచ్చి ప్రాణము తీసుకుపోయింది. భగవంతుని సృష్టిలో కర్మఫలమును తప్పించటానికి వీలుకాదు.

**కర్మదాట వశమా, నరుడా కర్మదాట వశమా**
**ధనికుడు తృటిలో బికారి కాడా, పండితుడింకనూ పశువై పోడా**
**కట్టే పామై కరవను రాగా కర్మే హేతువు, కర్మే మూలము ॥ కర్మ ॥**

sri sathyasai vachanamrutam

చిన్న చెలమలో ముంచినగాని పెను సముద్రములో ముంచినగాని
కడవెంతో నీరంతేరా కావాలన్నను ఎక్కువ కాదురా ॥ కర్మ ॥

**దేహ సంబంధము పెంచుకున్నదేగాని, సహజమైనది కాదు**

కర్మ దాటుటకు వశముకాదు. అంతా భగవత్సంకల్పమే! దేహములో గల ఈ అనుబంధములను పురస్కరించుకొని సుఖ, దుఃఖములను, ఆనందమును అనుభవిస్తున్నాడు మానవుడు. ఈ దుఃఖములు, ఆనందములు తాను పెంచుకున్నవే! ఇవి సహజముగా లభించినవి కావు. దీనికి ఒక చిన్న ఉదాహరణము. ఒక తల్లికి 25 సం॥లు బిడ్డడు వున్నాడు. తాను 25 సం॥లు తల్లి ప్రేమను, జీవితములో సుఖములు అనుభవించి కట్టకడపటికి మరణించాడు. ఆ దుఃఖము తల్లి హృదయములో నాటుకొని జీవితమంతయు వుంటుండాది. ఇంకొక కుమారుడు పుట్టిన రెండు గం॥లకే మరణించాడు. దానికికూడను ఒక దినము ఏడ్చింది. 25 సం॥లు వయస్సుగల వ్యక్తి తన కుమారుడే, మరియు రెండు గం॥లలో చనిపోయిన బిడ్డకూడా తన కుమారుడే! 25 సం॥లు బిడ్డ చనిపోతే జీవితమంతయూ తలచుకొని ఏడుస్తుంది. కాని రెండు గం॥లు జీవించిన బిడ్డ చనిపోతే ఆ రోజుతో మరచిపోయింది. ఈ వ్యత్యాసము ఎందుకొచ్చింది? ఇద్దరూ తన బిడ్డలే! 25 సం॥ల వరకు ఆ దేహముతో బంధము పెంచుకున్నది. కేవలము రెండు గం॥లే యీ బిడ్డతో బంధమున్నది. కాబట్టి, దేహ సంబంధము పెంచుకున్నదే కాని సహజమైనది కాదు. కనుక, యీ దేహ బంధముచేతను, సంబంధబాంధవ్యముచేతను, అనుబంధముచేతను మనము బంధింపబడుతున్నాము. కాని, 'ఎవరికి వారే యమునా తీరే'. కాబట్టి నా కుమారుని కర్మ ఆ విధముగా పోయింది. నా కర్మ ఈ కుమారునివలన ఏడ్చవలసి వచ్చింది. అతడు చావటానికి అతని కర్మ, నేను ఏడ్చుటానికి నా కర్మ. పాము చంపవలసివచ్చింది కాబట్టి పాము కర్మ. ఏవి కర్మను అనుసరించి ఆయా కాయములు వచ్చినవి. యీ విధముగా ఆ తల్లి ఆ వేటగానికి బోధపరిచింది. కనుక, ఓ ధర్మరాజా! యీ కథను నీవు చక్కగా విన్నావా, సామాన్యమైనటువంటి గృహిణి కర్మఫలము గురించి అర్థము చేసుకుంది. నీవు ధర్మస్వరూపుడవు, నీవు రాజు కావలసినటువంటివాడవు. నీకు కర్మఫలముపైన విశ్వాసము లేకుండాపోతున్నది. ఇంక దైవముపైన ఏ విధముగా విశ్వాసము కలుగుతుంది?

sri sathyasai vachanamrutam

అందువలననే నీవు కృష్ణుని సందేహిస్తున్నావు. నీ అవసరానికి బట్టి కృష్ణుని వుపయోగపెట్టుకున్నావు. నీ అవసరము తీరిపోయిన తరువాత కృష్ణుని దూరము చేసుకుంటున్నావు. కృష్ణుని దూరము చేసుకుంటివా, నీకు జీవితమంతా అపజయము అయిపోతుంది. కనుక. 'సర్వ కర్మ భగవత్ ప్రీత్యర్థం' అని అతనికి అర్పితము చేయి" అని బోధించాడు, భీష్ముడు. ఇంకా "సుఖములందునూ, దుఃఖములందునూ, విజయమునందునూ, అపజయమునందునూ, లాభమునందునూ, నష్టమునందునూ నీవే తప్ప ఎవరూ లేరని, అతనిని వదలకు. కృష్ణుడు ఎవరని నీవు భావిస్తున్నావు? సాక్షాత్తూ విష్ణుస్వరూపము. నీతో ఆడి, పాడియుండటముచేత నీవు అతనిని సామాన్యునిగా భావించవద్దు. అతనియొక్క సర్వజ్ఞత్వము, సర్వ శక్తితత్త్వము, సర్వ వ్యాపకతత్త్వము నాకు తెలుసును. నీవు స్వార్థాన్ని అలవరచుకుంటున్నావు. అతను ఏమి చెప్పితే అది చెయ్యి. అతని అడుగుజాడలలో నీవు నడచుకో" అని చెప్పాడు. యీ విధముగా బోధించేటప్పటికి, ధర్మజుని హృదయము కరిగిపోయినది. "పితామహా! కృష్ణుని ఆజ్ఞను నేను ఉల్లఘించటములేదు. కాని, నేను చేసినటువంటి పాపములు నాకు కళ్లకు కట్టినట్టుగా కనపడుతున్నాయి. ఆనాడు 'అశ్వత్థామ హతః కుంజరః' అని కృష్ణుడు చెప్పమని చెప్పినప్పుడు నేను విన్నాను. అది తప్పని నాకు తెలుసు. కాని, కృష్ణుని ఆజ్ఞను తిరస్కరించకూడదని భావించాను. యీనాడు కృష్ణుని ఆజ్ఞను వీడుతున్నానంటే ఇది నా ప్రారబ్ధము. కృష్ణుని ఆజ్ఞను వీడాలని లేదు. కాని ఇంతమంది పెద్దలను చంపి ఏ విధముగా రాజ్యము ఏలాలనే బాధ నన్ను పీడిస్తున్నాది. అంతా కర్మమయమే అని తెలుసుకున్నాను. కాబట్టి నేను మీ ఆజ్ఞ ప్రకారము కృష్ణుని మాటమీదుగా నడచుకుంటాను. కానీ కృష్ణుడే నాకు పట్టాభిషేకము చేయాలి" అని కృష్ణునికి శరణాగతి అయ్యాడు. 'కృష్ణా! నీ ఆజ్ఞను వినకుండా, భీష్ముని ఆజ్ఞను శిరసావహించానంటే నాలోన దేహభ్రాంతి యుంటుండాది. దేహభ్రాంతి కలిగియున్నటువంటివాడు భగవంతుని ఆజ్ఞను ఉల్లంఘిస్తాడు', అని కృష్ణుని యెదుట తన ఆవేదనను వెళ్లబోసుకున్నాడు. కృష్ణుని ఆజ్ఞను శిరసావహించి, ధర్మజుడు రాజ్య పట్టాభిషేకము చేసుకుంటాడు.

**(తేదీ 04-5-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

srisatyasaivachanamrutam